సాక్షి
బాపట్ల
ఆదివారం । 26 । జనవరి । 2025



గాయత్రీ దీప మహాయజ్ఞం

పొన్నూరు: అఖిల విశ్వ గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో శనివారం సాక్షి భావన్నారాయణ స్వామి దేవస్థానం ప్రాంగణంలో 24 దీపాలతో గాయత్రి దీప మహా యజ్ఞం నిర్వహించారు.



పారదర్శకంగా సర్వే

నిజాంపట్నం: ఆయుష్మాన్ భారత్ సర్వే పారదర్శకంగా నిర్వహించాలని డీఎంహెచ్‌వో విజయమ్మ చెప్పారు. కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం ఆమె సందర్శించారు.



శ్రీవారికి ప్రత్యేక పూజలు

మాచర్ల: పట్టణంలో వేంచేసియున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో అర్చకులు అడిగొప్పల చెన్నకేశవాచార్యులు శనివారం అర్చనలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

దేవాలయంలో చోరీ



బొల్లాపల్లి : దేవాలయంలో హుండీ పగలగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన మండలంలోని వడ్డెంగుంట గ్రామంలో చోటుచేసుకొంది. గ్రామంలోని పోలేరమ్మ, పాటిపాటేమ్మ దేవాలయంలో దుండగలు మూడు హుండీలను పగలగొట్టి సుమారు రూ.2 లక్షలు కానుకలు చోరీకి పాల్పడ్డారు. రోజువారీ పూజలో భాగంగా శనివారం నైవేద్యం సమర్పణ పూజకు వెళ్లిన పూజారి ఈ విషయం గమనించి గ్రామస్తులకు తెలిపారు.

ఇసుక అక్రమ తవ్వకాలు నిలిపివేత



అచ్చంపేట: మండలంలోని కోనూరు వద్ద కృష్ణానదిలో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను అడ్డుకున్నట్లు తహసీల్దారు జి.శ్రీనివాస యాదవ్ శనివారం తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నదికి అడ్డంగా రోడ్డు వేసి, యంత్రాల సహాయంతో ఇసుక తవ్వకాలు నిర్వహించి, తరలిస్తున్నారని తెలిపారు. పల్నాడు జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ఈ రోడ్డుకు గండి కొట్టించామని చెప్పారు. ఇకపై నదిలోకి లారీలు, జేసీబీలు వెళ్లేందుకు వీలుపడదని పేర్కొన్నారు.

జాతీయ సైక్లింగ్ పోటీలకు అర్షతునీసా బేగం




గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరుకు చెందిన షేక్ అర్షతునీసా బేగం ఈ నెల 28వ తేదీ నుంచి ఉత్తరాఖాండ్‌లో జరగనున్న జాతీయ సైక్లింగ్ పోటీలకు ఎంపికైనట్లు నేషనల్ సైక్లిస్ట్ బండ్లమూడి సుబ్బయ్య శనివారం తెలిపారు. ఈ మేరకు సైక్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి తమకు లెటర్ వచ్చిందన్నారు. ఈ సందర్భంగా తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ తన కార్యాలయంలో అర్షతునీసా బేగాన్ని అభినందించారని తెలిపారు. పేద కుంటుంబంలో పుట్టిన అర్షతునీసా గతంలోనూ జాతీయ స్థాయి పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు.

2 నుంచి మోపిదేవిలో బ్రహ్మోత్సవాలు



మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మోపిదేవి శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి రెండు నుంచి ఆరో తేదీ వరకు ఐదు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలో శతాబ్దాల నాటి నాగమల్లి వృక్షం ఉంది. నాగమల్లి వేయి పడగలతో లోపల లింగాకారంతో ప్రకాశిస్తుంది. ఏడాదికి రెండు సార్లు మాత్రమే పువ్వులు విచ్చుకుంటాయి. భక్తులు కోర్కెలు తీర్చాలని కోరుతూ వృక్షానికి ముడుపులు కడతారు. పిల్లల కోసం మహిళలు ఊయల కడుతుంటారు. ఆలయ ప్రాంగణంలోని పుట్టలో పాలుపోసిన తర్వాత స్వామివారిని దర్శించుకోవడం విశేషం. దేవాలయలంలోని కోనేరులో తొలిసారిగా స్వామి వారి తెప్పోత్సవానికి దేవదాయశాఖ శ్రీకారం చుట్టింది. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు ఆరో తేదీ గురువారం సాయంత్రం ఆరు గంటలకు తెప్పోత్సవం చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1716 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 100, బ్యాంక్ కెనాల్‌కు 150, తూర్పు కెనాల్‌కు 239, పశ్చిమ కెనాల్‌కు 180, నిజాంపట్నం కాలువకు 80, కొమ్మమూరు కాలువకు 600 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు.

కల్తీ కాటు

- జిల్లాలో జోరుగా కల్తీ నూనె వ్యాపారం
- విజయవాడ, గుంటూరు నుంచి దిగుమతి
- ప్రజలకు తీవ్ర అనారోగ్యం
- కొరవడిన ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు



పర్చూరులో బహిరంగంగా అమ్మకాలు సాగుతున్న నాసి రకం వంట నూనె

పర్చూరు(చినగంజాం): పెరుగుతున్న నిత్యావసర ధరలకు తోడు కల్తీ నూనె విక్రయాలు జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. వినియోగదారులు మోసపోవడంతోపాటు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారు. అక్రమార్జనకు అలవాటుపడిన వ్యాపారులు వేరుశనగ నూనెలో సోయాబీన్, తవుడు, పత్తి విత్తనాల నుంచి తీసిన తక్కువ నాణ్యత కలిగిన నూనెలను కలిపి అమ్ముతున్నారు. అంతేకాకుండా విజయవాడ, గుంటూరు వంటి పెద్ద పట్టణాల్లో నిర్వహించే హోటళ్లు, రెస్టారెంట్‌లలో ఒకసారి వినియోగించిన నూనెలను శుద్ధి చేసి తిరిగి వాటిని చిరువ్యాపారులకు, చిన్నహోటళ్లకు అమ్ముతున్నట్లు ఆరోపణలు వినవస్తున్నాయి.

నిషేధం ఉన్నా విక్రయాలు

నూనె విడి అమ్మకాలపై ప్రభుత్వం నిషేధం విధించినప్పటికీ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వ్యాపారులు యథేచ్ఛగా జరుపుతున్నారు. ఆయిల్ ప్యాకేజ్ యాక్ట్ 1998 ప్రకారం కేంద్ర ప్రభుత్వం విడిగా నూనె అమ్మడాన్ని నిషేధించింది. కొందరు వ్యాపారులు కోర్టులను ఆశ్రయించడంతో కొంతకాలం ఉత్తర్వులు అమలు కానప్పటికీ ప్రస్తుతం న్యాయ చిక్కులు తొలగిపోవడంతో విడిగా నూనె అమ్మకాలు ఆపి వేయాల్సి ఉంది. అయినప్పటికీ వ్యాపారులు అమ్మకాలు నిర్వహిస్తూనే ఉన్నారు. వేరుశనగ, సన్‌ఫ్లవర్ ఆయిల్ వంటి నూనెలు 15 లీటర్ల డబ్బా రూ.2 వేలకు పైగా ఉంటే.. ఒకసారి ఉపయోగించిన కల్తీ నూనె రూ.500లకే విక్రయిస్తున్నారు. వంట నూనెలో ప్రధానంగా ట్రై ఆర్థో క్రెసిల్ పాస్ఫేట్ అనే రసాయనాన్ని ఉపయోగించి కల్తీ నూనె తయారు చేస్తారని ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) తెలియజేస్తోంది. ఇది ఫాస్పరస్ కలిగిన పెస్టిసైడ్ కావడం వలన నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపి పక్షవాతం, క్యాన్సర్ ఇతర రోగాలకు దారితీస్తుందని వైద్యులు చెబుతున్నారు.

కోట్లలో వ్యాపారం

జిల్లాలో కల్తీ నూనె వ్యాపారం ప్రతి యేటా కోట్లలో సాగుతుందని అంచనా. సుమారు రూ.2 కోట్ల మేర విడి నూనె వ్యాపారం జరుగుతున్నట్లు సమాచారం. జిల్లాలోని బాపట్ల, చీరాల, పర్చూరు, అద్దంకిల తోపాటు పలు ప్రాంతాల్లో విడి నూనె అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. సుమారు వందకు పైగా వంట నూనె విడిగా అమ్మే దుకాణాలు కొనసాగుతున్నాయి.



కల్తీ నూనెలతో తయారవుతున్న పూరీలు

బ్రాండెడ్ డబ్బాల్లో...

స్థానికంగా ఉన్న స్వీట్ షాపులు, హోటల్స్, చిప్స్ తయారీ దుకాణాలు, ఇతర తినుబండారాల షాపులకు విజయవాడ, గుంటూరు నుంచి కల్తీ నూనె సరఫరా అవుతోంది. నాసిరకం నూనెలు బ్రాండెడ్ డబ్బాల్లో పోసి డబ్బా రూ.500 నుంచి రూ.600లకే అమ్ముతుండడంతో చిరు వ్యాపారులు ఆకర్షితులవుతున్నారు. నాసిరకం నూనెలతో తయారైన తినుబండారాలు తిని ప్రజలు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. నాసిరకం నూనెతో తయారుచేసిన తినుబండారాలు అధిక ధరలకు విక్రయించి దుకాణ యజమానులు ప్రజలను దండుకుంటున్నారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు పర్చూరు ప్రాంతంలో తనిఖీ చేసిన దాఖలాలు లేవని అంటున్నారు.

కల్తీ నూనె వంటకాలతో అనారోగ్యం



స్వీట్లు, తినుబండారాల దుకాణాలు, చిన్న హోటళ్లు, చిప్స్ తయారీ దుకాణాల్లో కల్తీ నూనెలతో వంటకాలు తయారు చేస్తున్నారు. మా కళ్లముందే సరఫరా అవుతోంది.

–జూపూడి రోశయ్య

కల్తీ నూనెలతో ప్రమాదం



కల్తీ నూనెల వాడకం వలన ఆరోగ్యానికి ప్రమాదం. ఆహార పదార్థాలలో కల్తీ నూనె వాడటం వల్ల గుండె, నాడీ వ్యవస్థ దెబ్బతింటుంది. పక్షవాతం, క్యాన్సర్ వంటి రోగాలతోపాటు ఇతర రోగాలు వచ్చే ప్రమాదం ఉంది.

–డాక్టర్ సౌమ్య, పర్చూరు ప్రభుత్వ వైద్యశాల సివిల్ అసిస్టెంట్ సర్జన్

చర్యలు తీసుకుంటాం

కల్తీ నిత్యావసర వస్తువులు, నూనెలు విక్రయించే దుకాణాలపై చర్యలు తీసుకుంటాం. ప్రజలు అటువంటి దుకాణాలకు సంబంధించి పూర్తి సమాచారం అందించాల్సిందిగా కోరుతున్నాం.

–ప్రణీత్, ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్

బరితెగిస్తున్న అధికారపక్షం



వాములు తొలగిస్తున్న పొక్లెయిన్



దగ్గరుండి పర్యవేక్షిస్తున్న పోలీసు అధికారులు

- టీడీపీ నేతల ఒత్తిడితో పేదల గడ్డివాములు, పశువుల పాకలు, దిబ్బల తొలగింపు
- 20 ఏళ్లుగా ఉంటున్న వారికి అన్యాయం

టాస్క్‌ఫోర్స్: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన దగ్గర నుంచి నేతల కక్ష సాధింపు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. అద్దంకి మండలం చిన్నకొత్తపల్లి గ్రామంలోని పేద రైతులు 20 ఏళ్లుగా పశుగ్రాసం వాములు, పేడ దిబ్బలు, పశువుల పాకలు వేసుకున్న స్థలాలను పోలీసు బందోబస్తుతో వెళ్లి పొక్లెయిన్‌తో శనివారం తొలగించారు. బాధితులు అధికారుల కాళ్ల పట్టుకుని బతిమిలాడినా కనికరించలేదు. బాధితులు తెలిపిన సమాచారం..చిన్నకొత్తపల్లి గ్రామం సర్వే నంబరు 204లో 12.34 ఎకరాల సెంట్ల భూమి ఉంది. అందులో గ్రామస్తులు తరతరాలుగా నివాసం ఉంటున్నారు. ఇందులో ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం గత ప్రభుత్వ హయాంలో 60 సెంట్ల భూమిని ఇచ్చారు. ఆ భూమిలో రైతు భరోసా, సచివాలయం, విలేజ్ హెల్త్ సెంటర్‌ను నిర్మించారు. ఇవి మొత్తం 48 సెంట్ల విస్తీర్ణంలో ఉన్నాయి. మిగిలిన 12 సెంట్లలో ఉన్న ఓ రైతు కోర్టును ఆశ్రయించాడు. స్టేటస్‌కో ఆర్డర్ ఇవ్వడంతో దాని జోలికి అధికారులు పోలేదు. గత ప్రభుత్వ హయాంలో సర్వేయర్ అప్పటి తహసీల్దార్‌కు ప్లాన్ రిపోర్టు కూడా ఇచ్చారు. అదే సర్వేయర్ రాజకీయ నాయకుల ఒత్తిడి మేరకు మరో మ్యాప్‌ను సిద్ధం చేసి అధికారులకు ఇచ్చారు. దాని ప్రకారం ప్రభుత్వ భవనాల సమీపంలో ఉన్న వాములు, గేదెల పాకలు, పేడ దిబ్బలు ప్రభుత్వ భూమేనంటూ, నోటీసులు కూడా ఇవ్వకుండా, పోలీసుల బందోబస్తుతో వచ్చి తొలగించారు. బాధితులు కనీసం రెండు రోజులు సమయం ఇవ్వమని కాళ్లా.. వేళ్లా పడినా అధికారులు కనికరించలేదు. ఇది అలా ఉంటే, ఇదే స్థలం పంచాయతీకి సంబంధించిదంటూ హైకోర్టులో గ్రామానికి చెందిన చాగంటి గణపతి, రిట్ పిటిషన్ 3899/2024 గా కేసు వేశాడు. ప్రస్తుతం ఆ కేసు నడుస్తుండటం గమనార్హం. ఆ సమయంలో ఉన్న గ్రామ పంచాయతీ సెక్రటరీ ఆ స్థలంలో ఆక్రమణలు లేవంటూ కోర్టుకు తెలియజేసినట్లు బాధితులు చెబుతున్నారు.

కాళ్లు పట్టుకుని బతిమిలాడా



నేను ఆస్మా రోగిని. ఈ రోజే ఆసు పత్రికి వెళ్లి చూపించుకొచ్చా. రెండు రోజులు సమయం ఇవ్వండి. తీసేస్తాం.. అని కాళ్లపట్టుకున్నా అధికారులు వినలేదు. అధికార పార్టీ నాయకుల ప్రోద్బలంతోనే ఇదంతా చేశారు.

– చిన్నపరెడ్డి వెంకట కోటిరెడ్డి

నోటీసులు కూడా ఇవ్వలేదు



అయ్యా ఇరవై ఏళ్లకు పైగా ఇదే భూమిలో ఉన్నాం. గ్రామంలోని ఇళ్లనీ గ్రామ కంఠం స్థలాలే. అయినా ప్రభుత్వ భవనాల కోసం తలో రెండు సెంట్లు లెక్కన 60 సెంట్లు స్థలం ఇచ్చాం. ఇప్పుడు మిగిలింది కూడా మాదేనంటూ కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా అన్యాయం చేశారు.

– చింతంరెడ్డి వీరాంజిరెడ్డి

తీరంలో మడ పెంపకం

- కొత్తగా 200 హెక్టార్లలో సాగు
- ఇప్పటికే 100 హెక్టార్లలో మడ చానల్స్ నిర్మాణం పూర్తి
- మార్చి నాటికి మరో 100 హెక్టార్లలో నిర్మాణం
- 20 హెక్టార్లలో సర్వి సాగు
- రూ.2.15 కోట్లతో మడ, సర్వి సాగు



మడ అడవుల సాగుకు సిద్ధం చేసిన చానల్స్

సాక్షి ప్రతినిధి,బాపట్ల: జిల్లాలో 70 కిలోమీటర్ల మేర ఉన్న సముద్ర తీర ప్రాంతం రక్షణ కోసం మడ, సర్వి అడవుల పెంపకానికి జిల్లా అటవీశాఖ సిద్ధమైంది. ఇప్పటికే మడను నాటేందుకు సిద్ధమైన అధికారులు మార్చి నెల చివరి నాటికి కార్యక్రమాన్ని పూర్తిచేయనున్నారు. మడతో సర్విని సైతం సాగు చేస్తున్నారు. పర్చూరు, చీరాల, బాపట్ల, రేపల్లె నియోజకవర్గాల పరిధిలో తీరం వెంబడి వేలాది ఎకరాల్లో రొయ్యల చెరువులు సాగులో ఉన్నాయి. వాటికి అనుబంధంగా పెద్దఎత్తున ప్రాసెసింగ్ యూనిట్లు, యాచరీస్‌లను నెలకొల్పారు. వీటిలో ఉత్పత్తి అవుతున్న విషపూరిత వ్యర్థాలను కాలువల ద్వారా సముద్రంలోకి వదులుతుండడంతో మత్స్య సంపదతోపాటు మడ అడవులు క్షీణిస్తున్నట్లు తెలుస్తోంది. విషవ్యర్థాలు తీరంలో కలువకుండా అడ్డుకునేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చనిపోయిన మడ స్థానంలో కొత్తగా మడను పెంచేందుకు మాత్రం ప్రభుత్వం అధికారులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ముత్తాయిపాలెం, అడవులదీవి, దిండి, పులుగువారిపాలెం ప్రాంతాల్లో మూడు వేల హెక్టార్లలో ఇప్పటికే మడ అడవులు ఉండగా పొల్యూషన్‌తో వందల హెక్టార్లలో మడ అడవులు క్షీణించాయి. కానీ ప్రస్తుతం 200 హెక్టార్ల విస్తీర్ణంలో కొత్త మడను పెంచుతున్నారు. ఇప్పటి వరకూ 100 హెక్టార్ల మేర మడ పెంపకానికి చానల్స్ ఏర్పాటు చేశారు. మార్చి నెలాఖరుకు మిగిలిన 100 హెక్టార్లలో చానల్స్ సిద్ధం చేసి మడ విత్తనాలను నాటనున్నారు. యంత్రాలతో చానల్స్ ఏర్పాటు, ఇతర పనుల కోసం రూ.2 కోట్లు ఖర్చు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. మడ అడవులతోపాటు తీరంలో సర్వి చెట్లను షెల్టర్ బెల్ట్ పాయింట్లుగా ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి ఏటా మడతోపాటు తీరంలో సర్వి చెట్లను అటవీశాఖ సాగు చేస్తోంది. గతేడాది 30 వేల హెక్టార్లలో సాగు చేయగా ఈ ఏడాది 20 వేల హెక్టార్లలో సర్వి సాగు చేస్తున్నట్లు అటవీ అధికారులు చెబుతున్నారు.

తీరం రక్షణ కోసం మడ, సర్వి సాగు



జిల్లాలో 70 కిలో మీటర్ల మేర సముద్ర తీర ప్రాంతం వుంది. సునామీ, తుఫానులు లాంటి విపత్తులు వచ్చినప్పుడు తీర ప్రాంతం కోతకు గురికాకుండా ఉండేందుకు మడ అడవులతోపాటు సర్విని పెంచుతున్నాం. ప్రస్తుతం తీరం వెంబడి 3 వేల హెక్టార్లలో మడ అడవులు ఉండగా చనిపోయిన మడ స్థానంలో ఈ ఏడాది 200 హెక్టార్లలో మడ అడవులను, 20 హెక్టార్లలో సర్విని పెంచుతున్నాం. ఇందు కోసం సుమారు రూ.2.15 కోట్లు ఖర్చు చేస్తున్నాం.

– భీమయ్య, జిల్లా అటవీశాఖ అధికారి, బాపట్ల

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రమాణం చేస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల : దేశ భవిష్యత్తును నిర్ణయించే కీలకమైన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పి.జి.ఆర్.ఎస్ సమావేశ మందిరంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అందరికీ జాతీయ ఓటర్ల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2025 నాటికి 12,90,986 మంది ఓటర్లు ఉన్నారన్నారు. జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ నాయకులు ప్రజల నుంచే వస్తారన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో పాల్గొనే హక్కు, అవకాశం ఉందన్నారు. డీఆర్వో డి.గంగాధర్‌గౌడ్, ఆర్డీఓ పి.గ్లోరియా మాట్లాడారు. ఓటర్ జాబితా నవీకరణలో పాల్గొన్న సిబ్బందికి ప్రశంసా పత్రాలను, జాతీయ ఓటర్ల దినోత్సవ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రశంసాపత్రాలను, మెమోంటోలను జిల్లా కలెక్టర్ అందజేశారు. వయో వృద్ధులైన పేరం నాగేశ్వరరావు, పేరం వెంకటేశ్వర్లులను జిల్లా కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమానికి హాజరైన అధికారులు, విద్యార్థిని, విద్యార్థులతో జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, తహసీల్దార్ సలీమా తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా ప్రభుత్వ పాఠశాలల పునర్విభజన ప్రక్రియ

బాపట్ల:ప్రభుత్వ పాఠశాలల పునర్విభజన ప్రక్రియ శరవేగంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల పునఃనిర్మాణం, పునర్విభజన ప్రక్రియలో భాగంగా సూర్యలంక వెళ్లే మార్గంలోని సరస్వతి స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 543 మంది విద్యార్థులు నమోదు కాగా విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసిన విద్యార్థుల హాజరు, 13 తరగతి గదులలో విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఒక్కొక్క గదికి ఒక్కొక్క అధికారిని పంపించి హాజరు సరిగా ఉందా లేదా సరి పోల్చి ఫొటోలు తీయించారు. దాదాపు 45 నిమిషాలకుపైగా పాఠశాలలోనే ఉండి దస్త్రాలను పరిశీలించారు. ఆ పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న 22 మంది ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. సబ్జెక్టుల వారీగా వారితో మాట్లాడారు. ప్రతి త్రైమాసంలో 48 పిరియడ్‌లు విద్యాబోధన చేయాలనే నిబంధన విధిగా పాటించాలన్నారు. సిలబస్ పూర్తయిందా లేదా, స్లిప్ టెస్టుల నిర్వహణపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మంచి విద్యాబోధన అందించాలని అన్నారు. విద్యార్థుల గైర్హాజర్‌పై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యార్థుల హాజరు పక్కాగా ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వం ముఖ్యోద్దేశం అన్నారు. విద్యార్థులకు అధిక పోషకాలున్న ఆహారం అందించాలని సూచించారు. అదే ప్రాంగణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మధ్యాహ్న భోజనం వడ్డింపును పరిశీలించారు. ఆరుబయట భోజనం చేస్తున్న విద్యార్థినులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనం, కూరలు రుచిగా ఉన్నాయా లేదా అంటూ తెలుసుకున్నారు. ఆయన వెంట డీఈవో పురుషోత్తం, ఆర్డీఓ పి గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, తహసీల్దార్ సలీమా పాల్గొన్నారు.

చరిత్ర పుటల్లో అమరుల త్యాగాలు

డీన్.డాక్టర్ పి.ప్రసూనరాణి



మాట్లాడుతున్న డీన్ డాక్టర్ పి.ప్రసూనరాణి

బాపట్ల : స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొని అమరులైన వారి త్యాగాలు భారత చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచిపోతాయని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనరాణి పేర్కొన్నారు. వ్యవసాయ కళాశాలలో భారత రాజ్యాంగ ప్లాటినం జూబ్లీ వేడుకలు శనివారం నిర్వహించారు. ప్రసూనరాణి మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత స్వేచ్ఛ, సమానత్వం, సమ న్యాయం పరమావధిగా డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ అధ్యక్షతన రూపొందించబడ్డ రాజ్యాంగం దేశాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. అటువంటి రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. ఫోరం ఫర్ బెటర్ బాపట్ల సంస్థ నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు డా.పి.సి.సాయిబాబు గణతంత్ర విశేషాల విద్యార్థులకు వివరించారు. ప్రొఫెసర్ శ్రీరేఖ విద్యార్థుల ప్రవర్తన, నియమావళి గురించి వివరిస్తూ వారి బాధ్యత మరింత పెంపొందించుకునే దిశగా ప్రయాణించాలన్నారు. తొలుత రాజ్యాంగ పీఠికను ప్రార్థనా గేయంగా విద్యార్థులచే ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో జాతీయ అవార్డు పొందిన ప్రముఖ రచయిత అడుసుమల్లి మల్లికార్జునను సత్కరించారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

రాష్ట్రస్థాయి నాటక, నాటిక రచనల పోటీలు

తెనాలి: కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త నిర్వహణలో రాష్ట్రస్థాయి ద్వితీయ సాంఘిక నాటక, నాటిక పోటీలకు రచనలను ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నాటకానికి ప్రథమ బహుమతిని ఆరిశెట్టి శివన్నారాయణ స్మారకంగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిని పరాంకుశం వెంకట భవానీప్రసాద్ (బాబ్జీ) స్మారకంగా రూ.15 వేలు, నాటికకు ప్రథమ బహుమతిని భారతుల రామకృష్ణ స్మారకంగా రూ.15 వేలు, ద్వితీయ బహుమతిని గంధం నాగరాజు స్మారకంగా రూ.10 వేలు బహూకరిస్తామని తెలిపారు. ఇతి వృత్తంపై రచయితకు సంపూర్ణ అవగాహన ఉండాలని, అది రచనలో ప్రతిఫలించాలని తెలిపారు. రచనలను ఏప్రిల్ 16లోగా గోపరాజు విజయ్, ప్రధాన కార్యదర్శి, 3-96/2, పోలవరపువారి వీధి, కొలకలూరు(పోస్టు), తెనాలి మండలం, గుంటూరు జిల్లా-522307 (8309116568)కు పంపాలని కోరారు. వివరాలకు పిన్నమనేని మృత్యుంజయరావు, ముఖ్య సలహాదారును (7794004466)సంప్రదించాలని కోరారు.

గణతంత్ర వేడుకలకు సిద్ధం

ముస్తాబైన పోలీస్ పరేడ్ గ్రౌండ్



రిహార్సల్స్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

బాపట్లటౌన్: ఆదివారం జరిగే గణతంత్ర వేడుకలకు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌ను సిద్ధం చేశారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆధ్వర్యంలో జిల్లా పోలీస్ అధికారులు శనివారం ట్రయల్ రన్ నిర్వహించారు. జిల్లా పోలీసులకు కవాతుపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి నేతృత్వంలో పోలీస్ కవాతు నిర్వహించగా అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్ ఎస్పీకి గౌరవ వందనం సమర్పించి కవాతు మైదానం పరిశీలనకు ఆహ్వానించారు. రిహార్సల్స్‌లో భాగంగా ముందుగా సిబ్బంది నుంచి జిల్లా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతాకం ఆవిష్కరించారు. అనంతరం పరిశీలన వాహనంలో పరేడ్ గ్రౌండ్‌లో పర్యటించి సాయుధ పోలీసు బలగాల కవాతును పరిశీలించారు. కవాతు నిర్వహించే పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతిభ కనపరిచిన పోలీసు సిబ్బంది పతకాలు ఏవిధంగా అందుకోవాలో డెమో నిర్వహించారు. తొలుత టైగర్, షాడో, బిట్టు అనే పోలీస్ జాగిలాలతో ఆర్ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పరేడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, ఎస్బి ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం శనివారం 556.20 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 8,221 క్యూసెక్కులు విడుదలవుతోంది.

క్లుప్తంగా

విద్యుత్ ఉద్యోగిపై టీడీపీ నేత దాడి

నగరం: బాపట్ల జిల్లా నగరం మండలం ఈదుపల్లిలో విద్యుత్ శాఖ ఉద్యోగి కొక్కిలిగడ్డ శ్యాంసన్‌పై గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు తుమ్మల రవి దాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు.. ఈదుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నేత రవి తన అనుచరులతో కలిసి ఈనెల 18న ఈదుపల్లిలో విద్యుత్ లైన్‌లు వేసే విషయంలో వాగ్వ్వాదానికి దిగారు. ఇది కాస్తా పెరిగి రవి అతని అనుచరులు కలిసి జూనియర్ లైన్‌మన్ శ్యాంసన్‌పై దాడి చేశారు. లైన్‌మన్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే కేసు నమోదు కాకుండా టీడీపీ నేతలు అడ్డుకున్నారు. తర్వాత లైన్‌మన్‌ను భయపెట్టి కేసు రాజీ చేయించారు. ఈ విషయమై ఎస్‌ఐ భార్గవ్‌ను వివరణ కోరగా శ్యాంసన్ ఫిర్యాదు చేశారని తర్వాత రాజీ చేసుకున్నారని తెలిపారు.

ఉచిత క్వారీలో నిబంధనలు మీరితే చర్యలు

రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి

సాక్షి ఎఫెక్ట్

కొల్లూరు: ఉచిత ఇసుక క్వారీలో నిబంధనలు ఉల్లంఘించి ఇసుక తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని, మొదటి తప్పు కింద హెచ్చరికలతో వదిలిపెడుతున్నామని రేపల్లె ఆర్డీఓ రామలక్ష్మి గాజుల్లంక ఇసుక క్వారీ సిబ్బందిని హెచ్చరించారు. 'సాక్షి'లో శనివారం 'ఉచితం మాటున దోపిడీ' శీర్షికన వెలువడిన కథనంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో శనివారం రాత్రి ఆర్డీఓ రామలక్ష్మి గాజుల్లంక క్వారీ వద్దకు చేరుకున్నారు. క్వారీలో ఇసుక తవ్వకాలు జరుపుతున్న ప్రదేశం గురించి అధికారులను అడిగి తెలుసుకున్న ఆమె అక్రమ తవ్వకాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. క్వారీ నిర్వహణ రికార్డులు చూపాలని కోరిన ఆర్డీఓకు నిరాశే ఎదురైంది. ఆర్డీఓ రామలక్ష్మి గాజుల్లంక క్వారీ వద్ద గంటపాటు వేచి ఉన్నా సిబ్బంది కుంటి సాకులతో రికార్డులను మాత్రం ఆమె ముందుకు తీసుకురాకుండా వేచి ఉండేలా చేశారు. అయితే ఆమె క్వారీకి చేరుకున్న గంట వరకు మైనింగ్ ఏడీ రాజేశ్‌కుమార్ రాకపోవడంతో ఒక దశలో సహనం కోల్పోయిన ఆమె క్వారీ నిర్వాహకులతోపాటు, మైనింగ్ ఏడీ పైన కలెక్టర్‌కు రిపోర్టు చేస్తానని హెచ్చరించారు.



గాజుల్లంక ఇసుక క్వారీ వద్ద మైనింగ్ ఏడీ, డీఎస్పీలకు సూచనలిస్తున్న ఆర్డీఓ రామలక్ష్మి

హద్దులు దాటి తవ్వకుండా చర్యలు తీసుకోవాలి

ఉచిత ఇసుక క్వారీలో మైనింగ్ శాఖ నిర్ణయించిన హద్దుల్లో కాకుండా ఇతర ప్రదేశంలో తవ్వకాలు చేపట్టడంపై ఆమె మైనింగ్, రెవెన్యూ సిబ్బందిని ప్రశ్నించారు. తక్షణం మైనింగ్ శాఖాధికారులు నదిలో ఉచిత క్వారీ నిర్వాహకులకు కేటాయించిన ప్రదేశంలో హద్దులు ఏర్పాటు చేసి తవ్వకాలు జరిగేలా చూడాలని మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్‌కు సూచించారు. రికార్డులు పక్కాగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్వారీ నిర్వాహకుడు ఆమె ఉన్న సమయంలో అందుబాటులోకి రాకపోవడంతో సోమవారం రికార్డులతోపాటు రేపల్లె తన కార్యాలయానికి తప్పనిసరిగా వచ్చి హాజరవ్వాలని ఆదేశించారు. యంత్రాలతో తవ్వకాలు చేపట్టడంపై నిఘా ఏర్పాటు చేయాలని కొల్లూరు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లును ఆదేశించారు. పరిశీలనలో రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు, వేమూరు సీఐ పీవీ.ఆంజనేయులు, కొల్లూరు ఎస్‌ఐ జి.ఏడుకొండలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనది

ఎస్పీ తుషార్ డూడీ

బాపట్లటౌన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీసు అధికారులు, సిబ్బందిచే ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంతో సంక్రమించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాముఖ్యతను గ్రహించి మీతోపాటు మీ కుటుంబ సభ్యులకు, తోటి స్నేహితులు ఓటు హక్కు వినియోగించుకోవడం పై అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకు రావాలన్నారు. భారత పౌరులమైన మేము ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో మన దేశ ప్రజాస్వామ్య సాంప్రదాయాలను స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రభావాన్ని నిలబెడతామని మనతోపాటు ఎన్నికలు జరిగినప్పుడు ఓటు వేసేందుకు మన చుట్టుపక్కల వారిని కూడా తీసుకురావాలన్నారు. మతం, జాతి, కులం, వర్గ, భాష లేదా ఎటువంటి ఒత్తిడులకు ప్రభావితం కాకుండా ప్రతి ఎన్నికలో నిర్భయంగా ఓటు వేస్తామని ఇందుమూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, ఏ.ఆర్ డీఎస్పీ పి.విజయసారథి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జి.నారాయణ, అడ్మిన్ ఆర్‌ఐ మౌలుద్దీన్, వెల్ఫేర్ ఆర్.ఐ శ్రీనివాసరెడ్డి పోలీసు అధికారులు, సిబ్బంది, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ తుషార్ డూడీ

రేపు సీపీఆర్‌పై వర్క్‌షాపు

గుంటూరు మెడికల్: కార్డియో పల్మనరీ రిససిటేషన్(సీపీఆర్)పై గుంటూరు వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు అమెరికాకు చెందిన ప్రముఖ ఎమర్జన్సీ మెడిసిన్ స్పెషాలిటీ వైద్యులు డాక్టర్ వేమూరి ఎస్. మూర్తి తెలిపారు. వర్క్‌షాపు పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వేమూరి ఎస్. మూర్తి మాట్లాడుతూ గుండె జబ్బుతో ఆకస్మాత్తుగా కుప్పకూలిన వారిని సీపీఆర్(ప్రాణ రక్షణ ప్రక్రియ)తో బతికించవచ్చని చెప్పారు. జీజీహెచ్ ఎమర్జన్సీ మెడిసిన్ వైద్య విభాగాధిపతి డాక్టర్ చంద్ర రాధికారాణి మాట్లాడుతూ ఫిజీషియన్స్, రెసిడెంట్స్, మెడికల్ స్టూడెంట్స్, నర్సెస్, సాధారణ ప్రజలు సైతం ఈ వర్క్‌షాపును వినియోగించుకోవాలని ఆమె కోరారు. సమావేశంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఉప్పాల శ్రీనివాసరావు, డాక్టర్ అమరేశ్వర్ పాల్గొన్నారు.



వర్క్‌షాపు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు

ఐటీకోర్ ఎస్‌ఐకి అవార్డు

అభినందించిన ఎస్పీ తుషార్ డూడీ

బాపట్లటౌన్: బాపట్ల జిల్లాలో సమర్థంగా ఎన్నికల ప్రక్రియ జరిగేందుకు గత ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాలతో 'సమర్థ యాప్' రూపొందించిన బాపట్ల జిల్లా ఐటీ కోర్ ఎస్‌ఐ నాయబ్ రసూల్ 'ఎక్సలెన్స్ ఇన్ ఎలక్టోరల్ రోల్ మేనేజ్‌మెంట్' అవార్డు అందుకున్నారు. శనివారం విజయవాడలో జరిగిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ సమక్షంలో రాష్ట్ర సీఎస్ కె.విజయానంద్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. పురస్కారంలో భాగంగా రూ.15,000 నగదు, మెమెంటో, ప్రశంసాపత్రం అంజేశారు. 'సమర్థ యాప్' వినియోగించి గత సార్వత్రిక ఎన్నికలలో జిల్లా పోలీస్ యంత్రాంగం సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియ ముగిసే విధంగా చర్యలు తీసుకున్నారు. ఎక్కడ ఏ చిన్న అవాంఛనీయ ఘటన చోటు చేసుకున్న నిమిషాల వ్యవధిలోనే పోలీస్ అధికారులు సిబ్బంది ఆ ప్రదేశానికి చేరుకోవడం వల్ల సమస్య తీవ్రత పెరగకుండా ఆదిలోనే పరిష్కరించడం జరిగింది. బాపట్ల జిల్లాను ఆదర్శంగా తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా 'సమర్థ యాప్' ను ఎన్నికల కమిషన్ అమలులోకి తీసుకురావడం జరిగింది. అవార్డు అందుకున్న ఎస్‌ఐ నాయబ్‌రసూల్‌ను ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు.



అవార్డు అందుకుంటున్న ఐటీ కోర్ ఎస్‌ఐ నాయబ్‌రసూల్

ఎంపీడీవోల సంఘ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు ఎన్నిక



అధ్యక్షుడిగా ఎన్నికైన బండి శ్రీనివాసరావు, సభ్యులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఎంపీడీవోల సంఘ ఉమ్మడి గుంటూరు జిల్లా అడహక్ (తాత్కాలిక) కమిటీ అధ్యక్షుడిగా గుంటూరు రూరల్ ఎంపీడీవో బండి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం జరిగిన సంఘ సర్వసభ్య సమావేశంలో భాగంగా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులుగా జీవీ సత్యనారాయణ(రాజుపాలెం), పి.బాబూరావు (బాపట్ల), ఆర్‌ఈవీ ఫణికుమార్(మాచర్ల), ఏ. దీప్తి (తెనాలి), ఎస్. నాగలక్ష్మి (నిజాంపట్నం), ఆర్.శ్రీనివాసరావు (పెదకాకాని), పి.సీతారామయ్య (శావల్యాపురం), జి. సమతావాణి (తాడికొండ), ఏ. శ్రీనివాసరావు (దుగ్గిరాల) ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గ ప్రతినిధులు మాట్లాడుతూ వివిధ విభాగాలకు సంబంధించిన పనుల పర్యవేక్షణకు ఎంపీడీవోలను బాధ్యులను చేయడంతో పనిభారం పెరిగిపోతోందని తెలిపారు. పంచాయతీరాజ్‌కు సంబంధించిన ముఖ్య విషయాలపై దృష్టి సారించడం సాధ్యం కావడం లేదని, ఫలితంగా మండల పరిపాలనకు ఆటంకం ఏర్పడుతోందని చెప్పారు. ఎంపీడీవోల సమస్యల పరిష్కారం కోసం ఉమ్మడి జిల్లాలో సంఘాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించారు. ఏపీ గెజిటెడ్ అధికారుల సంఘ కో-కన్వీనర్, జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు నూతన సంఘ ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు.

ఉత్తమ ఏఈఆర్‌వో అవార్డు అందుకున్న సుందరమ్మ

కర్లపాలెం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కర్లపాలెం తహసీల్దార్ సుందరమ్మ ఉత్తమ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి అవార్డు అందుకున్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం జిల్లా కలెక్టర్ వెంకట మురళి తహసీల్దార్ సుందరమ్మకు బాపట్ల నియోజక వర్గం స్థాయిలో ఏఈఆర్‌వో అవార్డు అందజేసి అభినందనలు తెలిపారు. పాతనందాయపాలెం గ్రామానికి చెందిన వీఆర్వో వి.శివనాగరాజు, ఉత్తమ బీఎల్‌వోగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఉత్తమ అవార్డులు అందుకున్న తహసీల్దార్ సుందరమ్మకు, వీఆర్వో శివనాగరాజుకు మండలంలోని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.



సెల్ టవర్ ఎక్కి యువకుడు హల్‌చల్

చాకచక్యంగా దిగి వచ్చేలా చేసిన పోలీసులు

అద్దంకి: పట్టణంలోని నంబూరిపాలేనికి చెందిన ఓ యువకుడు సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానంటూ హల్ చల్ చేశాడు. రాంబాబు అనే వ్యక్తి మద్యం మత్తులో ఇంటి దగ్గరలోని సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో బంధువులు విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. పోలీసులు అతన్ని మాటల్లో పెట్టి తనకు తానుగా కిందకు దిగి వచ్చేవిధంగా చేయడంతో బంధువులు ఊపిరి పీల్చుకున్నారు.

ముగిసిన న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు

27 నుంచి విధుల్లోకి..

నగరంపాలెం: జిల్లాలోని అన్ని కోర్టులకు ఈనెల 27 నుంచి న్యాయవాదులు హాజరవుతారని గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కాసు వెంకటరెడ్డి తెలిపారు. న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై పొన్నూరు పట్టణ పోలీసుల దాడిని నిరసిస్తూ మూడు వారాలకు పైగా జిల్లా కోర్టు ఎదురుగా న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలను విరమించుకున్నట్లు ఆయన వెల్లడించారు. జిల్లా కోర్టు ఎదురు శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత నెల చివరలో న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై జరిగిన దాడిని నిరసిస్తూ రిలే నిరాహార దీక్షలు, మానవహారం, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, న్యాయమూర్తులకు వినతిపత్రాలు అందించినట్లు ఆయన గుర్తు చేశారు. ఈ క్రమంలో పొన్నూరు పట్టణ ఎస్‌ఐ సస్పెన్షన్‌తో పాటు ముగ్గురు కానిస్టేబుళ్లను బదిలీ చేశారని తెలిపారు. న్యాయవాదుల ఐక్య ఉద్యమాలతో న్యాయం చేకూరిందని చెప్పారు. భవిష్యత్‌లో న్యాయవాదులపై భౌతిక దాడులు జరిగితే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎల్‌ఏ) అధ్యక్షుడు జి.శాంతకుమార్ మాట్లాడుతూ న్యాయవాదులపై పోలీసులు అకారణంగా దాడులు జరిపితే ఉద్యమాలు చేస్తామని చెప్పారు. ఉద్యమానికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, ఇతర న్యాయమూర్తులు సహకరించారని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గౌరీశంకర్, మాజీ అధ్యక్షుడు కేవీకే సురేష్, న్యాయవాదులు మదిర నాగేశ్వరరావు, బేతాళ ప్రభాకర్, బేతాళ ప్రకాశరావు, జీఎస్ఎల్ రావు, షేక్ అజీజుద్దీన్, సత్యం, షేక్ సుభాని, జిలాని పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బార్ ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి

ఆయుష్ ఆరోగ్య మందిర్‌కు స్థల పరిశీలన

ప్రత్తిపాడు: మండలంలోని నడింపాలెంలో శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ పర్యటించారు. స్థానిక జాతీయ రహదారి సమీపంలోని 149/4ఏ సర్వే నంబరులో 21.61 ఎకరాల స్థలాన్ని ఆయుష్ ఆరోగ్య మందిర్‌కు కేటాయించేందుకు స్థానిక రెవెన్యూ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ నేపథ్యంలో సంబంధిత స్థలాన్ని జేసీ పరిశీలించారు. హద్దులు, సర్వే నంబరు మొత్తం విస్తీర్ణం, రోడ్డు, కోర్టు కేసులు, వివాదాలు తదితర విషయాలను తహసీల్దార్ జి.కరుణకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. స్థలంలో పెద్దపెద్ద గోతులు ఉండటంతో మైనింగ్ తవ్వకాలపై ఆరా తీశారు. అనంతరం అదే గ్రామంలోని సర్వే నంబరు 110-ఓ2లో ఇటీవల ఈఎస్‌ఐ హాస్పిటల్ నిర్మాణానికి అప్పగించిన 6.35 ఎకరాల భూమిని కూడా జేసీ పరిశీలించారు. స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు జేసీకి వివరించారు. వెంట మండల సర్వేయర్ శ్రీనివాసరావు ఉన్నారు.



నడింపాలెంలో భూమిని పరిశీలిస్తున్న జేసీ

గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి

ఎంపీడీవోల సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎంపీడీవోలు కృషి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో శనివారం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని ఎంపీడీవోలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు అధ్యక్షతన జరిగిన సమావేశంలో హెనీ క్రిస్టినా మాట్లాడారు. కొన్నిచోట్ల ప్రోటోకాల్ విషయంలో ఉల్లంఘనలు జరుగుతున్నాయని, వాటిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. జెడ్పీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఎంపీడీవోలపై ఉందని చెప్పారు. మండలస్థాయిలో అవకతవకలు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అటువంటి వాటిని ఉపేక్షించబోమని తెలిపారు. గ్రామాల అభివృద్ధిలో ఎంపీడీవోలు కీలకపాత్ర పోషించాలని, వారే అన్ని చూసుకోవాలని సూచించారు. జెడ్పీ ఆస్తులైన వ్యవసాయ, వాణిజ్య భూములు, అతిథి గృహాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, పడవ రేవుల వేలం సకాలంలో నిర్వహించి ఆదాయ వనరులు పెంచుకోవాలని ఆమె సూచించారు. బకాయిల వసూలుకు ఎంపీడీవోలు బాధ్యత తీసుకోవాలని, వనరులు పెంచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో డెప్యూటీ సీఈవో సీహెచ్. కృష్ణ, మూడు జిల్లాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెనీ క్రిస్టినా

ఆటోనగర్ పరుపుల కంపెనీలో మహిళ మృతి

పెదకాకాని: ఆటోనగర్‌లో పరుపులు, దిండ్లు తయారీ కంపెనీలో మహిళ ప్రమాదవశాత్తూ మరణించిన సంఘటన శనివారం జరిగింది. గుంటూరు ఆటోనగర్‌లోని శ్రీసాయి ఎంటర్‌ప్రైజెస్ పరుపుల తయారీ కంపెనీలో రెడ్డిపాలెం ఆదిత్యనగర్‌కు చెందిన కంభంపాటి రమణి పని చేస్తోంది. ఎప్పటి మాదిరిగానే శనివారం వచ్చిన ఆమె మిషన్ వద్ద పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ అందులో పడింది. పక్కన ఉన్న వారు చూసి మిషన్ ఆపి తీసే సరికే రమణి(26)ప్రాణాలు గాలిలో కలసిపోయాయి. మృతురాలికి భర్త వెంకటేష్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పి.టి. నారాయణస్వామి తెలిపారు.



నేడు ఉపకార వేతనాల పంపిణీ

తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ యోగీష్ చంద్ర

కొరిటిపాడు(గుంటూరు): కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ గుంటూరు, బలిజ కాపు సంక్షేమ సంఘం-కావలి వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం 19వ విద్య ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నారు. ఇందులో భాగంగా చదువులో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 133 మంది పేద విద్యార్థులకు రూ.4.48 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు తులసి గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి యోగీష్ చంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో రూ. 2.24 లక్షలు తులసి సీడ్స్‌కు చెందిన కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్ ద్వారా, మిగిలిన రూ.2.24 లక్షలు బలిజ కాపు సంక్షేమ సంఘం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు జిల్లా కావలి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న లేక్ వ్యూ హోటల్‌లో మధ్యాహ్నం 3గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని వెల్లడించారు.

పర్యాటక ప్రాంతాల్లో స్వచ్ఛతకు చోటివ్వాలి

యడ్లపాడు: పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలని సీజీఎస్‌టీ గుంటూరు కమిషనరేట్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్వచ్ఛత పఖ్వాడా 2025 ఉత్సవాలలో భాగంగా కొండవీడు కోటలో స్వచ్ఛత, ట్రెక్కింగ్ నిర్వహించారు. సీజీఎస్‌టీ గుంటూరు కమిషనరేట్, గుంటూరు ట్రెక్కింగ్ కింగ్స్, గుంటూరు డెకాథ్లాన్ సంయుక్త ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమం శనివారం జరిగింది. ఆయా సంస్థలకు చెందిన అధికారులు, సిబ్బంది, పాల్గొన్నారు. బృందాలుగా ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛతపై చైతన్యం తీసుకువచ్చేందుకు సమష్టి కృషి అన్నారు. కార్యక్రమంలో సీజీఎస్టీ అధికారులు బి.లక్ష్మీనారాయణ, బి.రవికుమార్, గాదె శ్రీనివాసరెడ్డి, ఈశ్వర్, ట్రెక్కింగ్ నిర్వాహకుడు పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

